




# నేటి దిక్సూచి

www.netidiksuchi.com

తెలుగు దినపత్రిక

TGTEL/25/A3190








ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :140 ఎడిటర్ పి. అలివేలు పేజిలు : 04, వెల. 2రూ/ బుధవారం- 16 - సెప్టెంబర్ - 2026


## కోర్టులో ట్రంప్ కు ఎదురుదెబ్బ..
# విదేశీ విద్యార్థులు, జర్నలిస్టులకు ఊరట

- భారత్ సహా పలు దేశాల నుంచి అమెరికాలో చదువుకుంటున్న అంతర్జాతీయ విద్యార్థులకు ఊరట లభించింది.
- దాదాపు 600 ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంస్థలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి.



వాషింగ్టన్: విదేశీ విద్యార్థులు, జర్నలిస్టుల వీసాల కాలపరిమితిపై ట్రంప్ ప్రభుత్వం తీసుకొచ్చిన కఠిన నిబంధనలను అమెరికా ఫెడరల్ కోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. మంగళవారం నుంచి ఈ నిబంధనలు అమల్లోకి రావాల్సి ఉండగా, ఒక్కరోజు ముందే మసాచుసెట్స్ జిల్లా న్యాయమూర్తి ఎఫ్. డెన్నిస్ ప్రాథమిక స్టే విధించారు. దీంతో భారత్ సహా పలు దేశాల నుంచి అమెరికాలో చదువుకుంటున్న అంతర్జాతీయ విద్యార్థులకు ఊరట లభించింది. కొత్త నిబంధనలు అమెరికాలో విదేశీ విద్యార్థులు, ఎక్స్ఛేంజ్ సందర్శకుల వీసాలను గరిష్ఠంగా నాలుగేళ్లకు, జర్నలిస్టుల వీసాలను 240 రోజులకు పరిమితం చేయాలని ప్రతిపాదించాయి. చైనా జర్నలిస్టులకు మాత్రం 90 రోజుల పరిమితి విధించారు. గడువు పొడిగింపునకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ.. దానిని ఆమోదించే అధికారం హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం అధికారుల విచక్షణకు వదిలారు. మిగతా..2లో

## మాజీ ప్రధాని షేక్ హసీనా సన్నిహితులు ఏడుగురికి మరణశిక్ష.. ఖరారు చేసిన బంగ్లాదేశ్ కోర్టు



- మానవత్వానికి వ్యతిరేకంగా నిందితులు వ్యవహరించారని జస్టిస్ మొహమ్మద్ నజ్రుల్ ఇస్లాం చౌదరి తీర్పు వెల్లడించారు.
- మాజీ ప్రధాని షేక్ హసీనాపై గత ఏడాదే ఇదే అంశంలో అక్కడి కోర్టు మరణశిక్ష విధించింది. ఇప్పుడు ఆమె అనుచరులకు శిక్ష పడింది.

ఢిల్లి : బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆమె సన్నిహితులు ఏడుగురికి బంగ్లాదేశ్‌కు మిగతా..2లో

## యూపీఐ చార్జీలు.. యూఎస్ ఒత్తిడికి
# కేంద్రం లొంగిందన్న రాహుల్ గాంధీ

- అమెరికా ప్రభుత్వ ఒత్తిడికి కేంద్ర ప్రభుత్వం లొంగిపోయిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తాజాగా ఆరోపించారు.
- యూపీఐ చార్జీలు విధించే దిశగా చడీచప్పుడూ లేకుండా మార్గం సిద్ధం చేసిందని మండిపడ్డారు.
- యూపీఐ చార్జీలు.. యూఎస్ ఒత్తిడికి కేంద్రం లొంగిందన్న రాహుల్ గాంధీ



ఇంటర్నెట్ డెస్క్: అమెరికా ప్రభుత్వ ఒత్తిడికి కేంద్ర ప్రభుత్వం లొంగిపోయిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తాజాగా ఆరోపించారు. యూపీఐ చార్జీలు విధించే దిశగా చడీచప్పుడూ లేకుండా మార్గం సిద్ధం చేసిందని మండిపడ్డారు. రూ.2 వేల లోపు యూపీఐ లావాదేవీలపై బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు చార్జీలు విధించవద్దంటూ కేంద్రం నోటిఫికేషన్ జారీ చేయడంతో రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజా నోటిఫికేషన్ పలు సందేహాలను లేవనెత్తుతోందని రాహుల్ గాంధీ అన్నారు. ఇది చివరకు అధిక మొత్తాల మిగతా..2లో

## కొండా సురేఖ బర్తరఫ్ బాధాకరమే..



- పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనతోనే ఏఐసీసీ చర్య తీసుకుందని వెల్లడి
- పార్టీ హద్దులు దాటితే ఎవరిపైనైనా చర్యలు తప్పవని స్పష్టీకరణ
- సీఎం రేవంత్‌రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని వ్యాఖ్య
- ప్రభుత్వం, పార్టీని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తున్నామని వెల్లడి
- పార్టీ సమస్యలను అంతర్గత వేదికల్లోనే చర్చించాలని సూచన

హైదరాబాద్ : కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్

## అసెంబ్లీలో 22పై చర్చ..
# రెవెన్యూ శాఖపై సీఎం సమీక్ష

- రెవెన్యూ శాఖపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు.
- మంగళవారం జూబ్లీహిల్స్‌లోని వీలో ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు.
- 22పై చర్చ - బుధవారం అసెంబ్లీలో 22 పై చర్చించాల్సిన అంశాలపై సీఎం రేవంత్ సమీక్షించారు.



హైదరాబాద్, సెప్టెంబర్ 15: రెవెన్యూ శాఖపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. 22ఏపై చర్చ - బుధవారం అసెంబ్లీలో 22ఏ పై చర్చించాల్సిన అంశాలపై సీఎం రేవంత్ సమీక్షించారు. ఈ సందర్భంగా 22ఏ జాబితాపై సీఎం రేవంత్‌కు రెవెన్యూ శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సమీక్షలో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్, సీఎస్ సంజయ్ జాజుతోపాటు రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమీక్ష సీఎం రేవంత్ రెడ్డితో మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, శ్రీధర్ బాబు, వివేక్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బుధవారం అసెంబ్లీలో 22ఏ, ఎల్ నినోపై చర్చ సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహం గురించి వారు చర్చించారు.

### లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి: డిప్యూటీ సీఎం

## ఉద్యోగులతో పెట్టుకుంటున్నారు..
# కాంగ్రెస్ ఓటమి ఖాయం



- ఉద్యోగులతో విభేదించిన ప్రభుత్వాలు మళ్లీ అధికారంలోకి రాలేదని కవిత వ్యాఖ్య
- కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోవడం ఖాయమని విమర్శలు
- ఉద్యోగులు, ఉపాధ్యాయులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపణ
- 630 మండలాలకు 8 మంది పర్మినెంట్ ఎంఈవోలే ఉన్నారని విమర్శ
- పీఆర్సీ, డీఏలపై ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపణ

హైదరాబాద్ : ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పెట్టుకున్న ప్రభుత్వాలు మళ్లీ అధికారంలోకి వచ్చిన దాఖలాలు లేవని

## తెలుగు రాష్ట్రాలకు కేంద్రం భారీ కానుక.. అదనంగా 5 లక్షల ఇళ్లు మంజూరు



- ఆంధ్రప్రదేశ్‌కు 3 లక్షల ఇళ్ల కేటాయింపు
- తెలంగాణకు 2 లక్షల ఇళ్లు
- ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు ప్రయోజనం
- గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హులకు ఇళ్ల నిర్మాణానికి అవకాశం
- త్వరలో జిల్లాల వారీగా లబ్ధిదారుల ఎంపిక

అమరావతి : ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద తెలుగు రాష్ట్రాలకు అదనంగా మరో 5 లక్షల ఇళ్లను మంజూరు చేసింది. ఇప్పటికే కేటాయించిన ఇళ్లకు అదనంగా ఈ ఇళ్లను అందించనుంది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు 3 లక్షలు, తెలంగాణకు 2 లక్షల ఇళ్లు కేటాయించింది. ఈ నిర్ణయంతో రెండు రాష్ట్రాల్లోని మిగతా..2లో

## 22ఏ భూముల సమస్య తీవ్ర రూపం దాల్చింది: రఘునందన్ రావు



- లక్షలాది మంది ప్రజలు రిజిస్ట్రేషన్లు కాక ఇబ్బంది పడుతున్నారన్న రఘునందన్ రావు
- అసెంబ్లీలో మంత్రి పొంగులేటి సమాధానం దాటవేశారని విమర్శ
- కాంగ్రెస్ ప్రభుత్వం బురద చల్లే రాజకీయాలు చేస్తోందని మండిపాటు

హైదరాబాద్ : తెలంగాణలో 22ఏ నిషేధిత జాబితా భూముల సమస్య తీవ్ర రూపం దాల్చిందని, దీనివల్ల లక్షలాది మంది సామాన్య ప్రజలు రిజిస్ట్రేషన్లు కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన మిగతా..2లో

## ఆళ్ల నాని మృతి పట్ల
# జగన్ తీవ్ర దిగ్భ్రాంతి



- గుండెపోటుతో హఠాన్మరణం చెందిన ఆళ్ల నాని
- నాని మరణవార్త తనను కలచి వేసిందన్న జగన్
- ఆళ్ల నాని మృతి తీరని లోటు అన్న బొత్స సత్యనారాయణ

అమరావతి : మాజీ ఉప ముఖ్యమంత్రి, ఏలూరు మాజీ ఎమ్మెల్యే ఆళ్ల నాని (56) అకస్మాత్తుగా గుండెపోటుతో

## కోచింగ్ కేంద్రాలు రాజకీయ
# కుట్రలకు వేదిక కాకూడదు

- కోచింగ్ కేంద్రాల్లో నిబంధనల ఉల్లంఘనలను సహించబోమని సీఎం చంద్రబాబు అన్నారు.
- అభ్యర్థులను రాజకీయ ఆందోళనలకు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



అమరావతి : పోటీ పరీక్షల కోచింగ్ ముసుగులో రాజకీయ ఆటలు సాగితే కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. రాజకీయ ప్రేరేపిత ఆందోళనలకు కోచింగ్ కేంద్రాలు అడ్డాగా మారొద్దని సీఎం స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై చట్టపరంగా కొరడా ఝుళిపించాలని అధికారులను ఆదేశించారు. ఈ వ్యవహారంపై సమీక్ష నిర్వహించిన సీఎం కోచింగ్

## హోంవర్క్ సున్నా..
# ఆరోపణలు వంద..



- నిరుద్యోగుల అవకాశాలపై సాక్షి విషం చిమ్ముతోందని ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు.
- ఐదేళ్లపాటు ఒక్క వెటర్నరీ డాక్టర్ పోస్టును కూడా వైసీపీ భర్తీ చేయలేదని విమర్శించారు.

అమరావతి, సెప్టెంబర్ 15: నిరుద్యోగుల అవకాశాలపై సాక్షి విషం చిమ్ముతోందని ఆంధ్రప్రదేశ్ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. ఐదేళ్లపాటు ఒక్క వెటర్నరీ డాక్టర్ పోస్టును కూడా వైసీపీ భర్తీ చేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం 160 వెటర్నరీ డాక్టర్ పోస్టుల భర్తీకి అనుమతిచ్చిందని వెల్లడించారు. ఉద్యోగాలు ఇస్తుంటే ఓర్వలేక.. తప్పుడు కథనాలతో అడ్డుకునే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. అభ్యర్థులు

మొదటి పేజి తరువాయి

## తెలుగు రాష్ట్రాలకు కేంద్రం భారీ కానుక..
# అదనంగా 5 లక్షల ఇళ్లు మంజూరు

ఇళ్లు లేని పేద కుటుంబాలకు ప్రయోజనం కలగనుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హత ఉన్న కుటుంబాలు సొంతింటి నిర్మాణానికి కేంద్రం అందించే సాయాన్ని పొందే అవకాశం ఉంటుంది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద భారీగా ఇళ్లను కేటాయించిన కేంద్రం.. తాజాగా మరో 5 లక్షల ఇళ్లకు ఆమోదం తెలిపింది. కొత్త కేటాయింపులతో మరింత మంది నిరుపేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరే అవకాశం ఉంది. త్వరలో జిల్లాల వారీగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుంది. అర్హతలు, ఎంపిక విధానం, లబ్ధిదారుల జాబితాకు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులు వెల్లడించనున్నారు. అర్హత ఉన్న కుటుంబాలు ప్రభుత్వ ప్రకటనలపై దృష్టి పెట్టాలని అధికారులు సూచిస్తున్నారు.

# ఆళ్ల నాని మృతి పట్ల జగన్ తీవ్ర దిగ్భ్రాంతి

తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విశాఖపట్నంలోని తన నివాసంలో ఆళ్ల నాని హఠాన్మరణం చెందారన్న వార్త తనను తీవ్రంగా కలచివేసిందని ఆయన తెలిపారు. నాని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్టసమయంలో వారికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఆళ్ల నాని ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ... ఆళ్ల నాని మరణవార్త విని తాను శోకసముద్రంలో మునిగిపోయానని, ఆయన మృతి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రులు కన్నబాబు, వెల్లంపల్లి శ్రీనివాసరావు ఆళ్ల నాని కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని ప్రకటిస్తూ ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు. వైసీపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆళ్ల నాని భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశాఖపట్నంలో గుండెపోటుకు గురైన ఆళ్ల నానిని ఆసుపత్రికి తరలించేలోపే ప్రాణాలు విడిచారు. ఏలూరు నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన, గత వైసీపీ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా, వైద్యారోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన సంగతి తెలిసిందే.

## అసెంబ్లీలో 22పై చర్చ.. రెవెన్యూ శాఖపై సీఎం సమీక్ష

'రాజీవ్ యువ వికాసం' తొలి విడత సాయం అందిస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. మంగళవారం ప్రజాభవన్‌లో ఎస్సీ, ఎస్టీ సంక్షేమంపై ఆయన సమీక్షించారు. రూ. లక్ష లోపు స్వయం ఉపాధి యూనిట్లకు తొలి విడత ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. ఎస్సీ గురుకులాల్లో కేంద్రీకృత యంత్రాలతో వంటశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. మెకనైజ్డ్ కిచెన్ల ఏర్పాటుకు రూ. 25 కోట్ల నిధుల విడుదల చేస్తున్నట్లు చెప్పారు. 15 రోజుల్లో కేంద్రీకృత వంటశాలలపై కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులకు ఆయన స్పష్టం చేశారు. ఎస్సీ గురుకులాల పూర్వ విద్యార్థుల సమగ్ర డేటాబేస్ రూపొందించాలని సూచించారు. పూర్వ విద్యార్థుల స్థితిగతులపై సీఈఎస్ఎస్‌తో సమగ్ర అధ్యయనం చేపట్టాలని తెలిపారు. స్టడీ సర్కిళ్ల పనితీరుపై వివరణాత్మక నివేదిక ఇవ్వాలని తెలిపారు. ఎస్సీ డిగ్రీ కళాశాలల్లో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలని పేర్కొన్నారు. 26 ఏకలవ్య పాఠశాలల నిర్మాణ ప్రతిపాదనలు కేంద్రానికి పంపినట్లు ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు అధికారులు వివరించారు. ఈ సమీక్షకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్, సంక్షేమ శాఖ అధికారులు హాజరయ్యారు.

# కొండా సురేఖ బర్తరఫ్ బాధాకరమే..

మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. అయితే పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించినందుకే ఏఐసీసీ ఈ నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. పార్టీ నిర్దేశించిన హద్దులు దాటితే ఎంతటివారిపైనైనా చర్యలు తప్పవని తేల్చిచెప్పారు. హైదరాబాద్‌లో మంగళవారం మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ పార్టీ అంతర్గత వ్యవహారాలు, ఇటీవలి పరిణామాలపై మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, తనకు మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని, పార్టీని సమన్వయంతో ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు. "పార్టీ క్రమశిక్షణే అత్యంత ప్రధానం. ఏఐసీసీ నిర్దేశించిన హద్దులు, పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు" అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. పార్టీలో ఏమైనా సమస్యలు ఉంటే అంతర్గత వేదికలపై చర్చించుకోవాలని సూచించారు. విషయాలను బహిరంగంగా మాట్లాడి క్రమశిక్షణ ఉల్లంఘిస్తే అధిష్ఠానం ఉపేక్షించదని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డితో కలిసి ప్రజా సంక్షేమం విస్తరణ, తెలంగాణలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. తమ మధ్య గ్యాప్ ఉందంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని కోరారు. కాంగ్రెస్ కార్యకర్తల కష్టంతోనే తెలంగాణలో పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. సాధారణ కార్యకర్తలకు సైతం పార్టీలో కీలక పదవులు దక్కుతున్నాయని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి ఒక్కరినీ గుర్తిస్తామని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. పార్టీ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నేతలు, కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు.

## కోర్టులో ట్రంప్ కు ఎదురుదెబ్బ..
# విదేశీ విద్యార్థులు, జర్నలిస్టులకు ఊరట

తిరస్కరణపై అప్పీల్‌కు అవకాశం లేకపోవడం కూడా నిబంధనల్లో ఉంది. ఈ విధానం అమెరికా ఆర్థిక వ్యవస్థ, ఉన్నత విద్యా రంగానికి విపత్తు స్థాయి నష్టం కలిగించే అవకాశం ఉందని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. దాదాపు 600 ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంస్థలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. ఉపశమనాన్ని కేవలం పిటిషనర్లకే పరిమితం చేయాలన్న ప్రభుత్వ వాదనను కూడా న్యాయమూర్తి తిరస్కరించారు. వీసా మోసాలను అరికట్టడం, గడువు ముగిసిన తర్వాత కూడా అమెరికాలో ఉండిపోయేవారిని గుర్తించడం సులభతరం చేయడమే కొత్త పరిమితుల ఉద్దేశమని ప్రభుత్వం వాదించింది. అయితే ప్రభుత్వాన్ని విమర్శించే విదేశీ జర్నలిస్టుల వీసా పునరుద్ధరణను అధికారులు నిరాకరించే స్పష్టమైన అవకాశముంది అని న్యాయమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త నిబంధనల అసలు ఉద్దేశం జాతీయ భద్రత కంటే విద్యాసంస్థలు, మీడియాపై ప్రభుత్వ నియంత్రణ పెంచడమేనా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయని తీర్పులో పేర్కొన్నారు.

## మాజీ ప్రధాని షేక్ హసీనా సన్నిహితులు
## ఏడుగురికి మరణశిక్ష.. ఖరారు చేసిన బంగ్లాదేశ్ కోర్టు

చెందిన ఒక కోర్టు మరణశిక్ష విధించింది. 2024లో జరిగిన అల్లర్ల సందర్భంగా ఏడుగురిని నిందితులుగా పరిగణిస్తూ బంగ్లాదేశ్‌కు చెందిన ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్-2 ఈ మరణశిక్ష ఖరారు చేసింది. మానవత్వానికి వ్యతిరేకంగా నిందితులు వ్యవహరించారని జస్టిస్ మొహమ్మద్ నజ్రుల్ ఇస్లాం చౌదరి తీర్పు వెల్లడించారు. 2024లో బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ఆధ్వర్యంలోని అవామీ లీగ్ ప్రభుత్వంపై ఆందోళనకారులు తిరగబడ్డ సంగతి తెలిసిందే. ఆందోళనల్ని అణచివేయడానికి ప్రభుత్వం కఠినంగా వ్యవహరించింది. ఈ సందర్భంగా ప్రభుత్వం అమానవీయంగా వ్యవహరించిందని అక్కడి ప్రతిపక్షాలు, ఆందోళనకారులు అంటున్నారు. ముఖ్యంగా ఏడుగురు నిందితులు సమావేశమై, ఆందోళనల్ని అణచి వేసేందుకు కుట్రలు చేశారని, హింసకు పాల్పడ్డారని వారిపై అభియోగాలు నమోదయ్యాయి. దీనిపై విచారణ జరిపిన కోర్టు ఏడుగురు నిందితులకు మంగళవారం మరణశిక్ష విధించింది. మాజీ ప్రధాని షేక్ హసీనాపై గత ఏడాదే ఇదే అంశంలో అక్కడి కోర్టు మరణశిక్ష విధించింది. ఇప్పుడు ఆమె అనుచరులకు శిక్ష పడింది. తాజాగా శిక్షకు గురైన వారిలో అవామీ లీగ్ పార్టీ ప్రధాన కార్యదర్శి, బంగ్లాదేశ్ మాజీ మంత్రి ఒబైదుల్ ఖాదర్, జాయింట్ సెక్రెటరీ బహవుద్దీన్ నసీమ్, మాజీ సమాచార మంత్రి అలీ అరాఫత్, జూబో లీగ్ చైర్మన్ షేక్ ఫాజిల్ షామ్స్ పరాష్, ఈ సంస్థ జనరల్ సెక్రెటరీ మైనుల్ హొస్సైన్ ఖాన్ నిఖిల్, బంగ్లాదేశ్ ఛాత్రా లీగ్ ప్రెసిడెంట్ సద్దాం హొస్సైన్, జనరల్ సెక్రెటరీ షేక్ వాలి అసిఫ్ ఉన్నారు.

## 22ఏ భూముల సమస్య
# తీవ్ర రూపం దాల్చింది: రఘునందన్ రావు



విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో 22ఏ భూములపై స్పష్టమైన చారిత్రాత్మక నిర్ణయం వస్తుందని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలిందని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ అంశంపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కనీస సన్నాహాలు లేకుండా సభకు వచ్చి అరకొర సమాచారంతో సమాధానం దాటవేసే ప్రయత్నం చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో కోటి ఎకరాలకు పైగా భూములను అడ్డగోలుగా 22ఏ జాబితాలో చేర్చిన అధికారులపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మంత్రి ప్రతిపాదిస్తున్నట్లు, ఇప్పటివరకు తొలగించామంటున్న 47,440 ఎకరాల వివరాలు ఏ గ్రామంలో ఎక్కడున్నాయో బహిర్గతం చేయాలని, మిగిలిన భూములపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ హైకోర్టు సిట్టింగ్ జడ్జితో కూడిన ప్రత్యేక కమిటీని నియమించి ధరణి, భూభారతి లొసుగుల వల్ల నష్టపోయిన పేదలకు న్యాయం చేయాలని రఘునందన్ రావు కోరారు. ప్రజా సమస్యలపై నిలదీస్తే బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనంటూ రేవంత్ సర్కార్ బురదజల్లే రాజకీయాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే మొదటి కేబినెట్ సమావేశంలోనే భూ సమస్యలకు పరిష్కారం చూపుతామని ఎంపీ స్పష్టం చేశారు.

# కోచింగ్ కేంద్రాలు రాజకీయ కుట్రలకు వేదిక కాకూడదు

మొదటి పేజి తరువాయి

కొన్ని ప్రైవేటు కోచింగ్ సంస్థలు తమ స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. అభ్యర్థులపై ఒత్తిడి తీసుకొచ్చి ఆందోళనలు, నిరసనల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్న వ్యవహారంపై అధికారులు సీఎంకు వివరించారు. పరీక్షల కోసం శిక్షణ పొందాల్సిన యువతను రాజకీయ కార్యక్రమాల్లోకి లాగడం ఏమాత్రం సమర్థనీయం కాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. నిర్దేశిత మార్గదర్శకాలను పాటించాలి: ఆంధ్రప్రదేశ్ కోచింగ్ సంస్థల నియంత్రణా నిబంధనలు2026 ప్రకారం ప్రైవేటు కోచింగ్ కేంద్రాలు తప్పనిసరిగా నిర్దేశిత మార్గదర్శకాలను పాటించాలని సీఎం స్పష్టం చేశారు. ముఖ్యంగా జీవో నెంబరు 9లోని నిబంధనలకు అనుగుణంగానే సంస్థల నిర్వహణ ఉండాలన్నారు. మార్గదర్శకాలను ఉల్లంఘించినట్టు తేలితే సంబంధిత కోచింగ్ సంస్థలపై చట్టపరమైన




చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. నిబంధనల అమలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పకడ్బందీగా జరగాలని సీఎం ఆదేశించారు. ప్రైవేటు కోచింగ్ కేంద్రాల కార్యకలాపాలను అధికారులు పరిశీలిస్తూ మార్గదర్శకాలకు అనుగుణంగా నడుస్తున్నాయో లేదో తనిఖీ చేయాలన్నారు నిబంధనల ఉల్లంఘన, అభ్యర్థులపై అనుచిత ఒత్తిడి వంటి అంశాలు బయటపడితే తక్షణమే చర్యలకు ఉపక్రమించాలని సూచించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకావద్దని ప్రభుత్వం సూచించింది. తమ కెరీర్, పరీక్షల సన్నద్ధతపైనే పూర్తి దృష్టి పెట్టాలని స్పష్టం చేసింది. కోచింగ్ సంస్థల నుంచి ఏదైనా ఒత్తిడి, ఇబ్బంది లేదా అనుచిత ప్రేరేపణ ఎదురైతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించింది. కోచింగ్ కేంద్రాల ప్రధాన ఉద్దేశం పోటీ పరీక్షలకు అభ్యర్థులను సమర్థవంతంగా సిద్ధం చేయడమేనని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆ లక్ష్యాన్ని పక్కనబెట్టి సంస్థల యజమానులు తమ వ్యక్తిగత లేదా ఇతర ప్రయోజనాల కోసం అభ్యర్థులను వినియోగిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించింది. రాజకీయ కుట్రలు, ఆందోళనలు, నిరసనలకు విద్యార్థులను వాడుకునే ప్రయత్నాలపై చట్టం తన పని తాను చేస్తుందని స్పష్టం చేసింది.

# హోంవర్క్ సున్నా.. ఆరోపణలు వంద.. ఇదే ఆ ఛానల్ పరిస్థితి

మొదటి పేజి తరువాయి

అమలు చేస్తే అక్రమమా? అని ప్రశ్నించారు. ఎనిమిదేళ్లుగా నియామకాలు జరగలేదని నిరుద్యోగుల సంఘం విజ్ఞప్తి చేసిందని తెలిపారు. ఈ ఒక్కసారికి పాత వెయిటేజీ విధానంలో నియామకాలు చేపట్టాలని నిర్ణయించినట్లు మంత్రి చెప్పారు. 52 ప్రకారం మెరిట్, వెయిటేజీ ఆధారంగా నియామక విధానం ఉందన్నారు. డీఎహెచ్ మార్కులకు 60, వీఎహెకు 10, కాంట్రాక్ట్ సేవలకు 10 మార్కుల వెయిటేజీ కేటాయించినట్లు తెలిపారు. అలాగే సీనియారిటీకి ప్రతి ఏడాదికి 4 మార్కుల చొప్పున వెయిటేజీ ఇవ్వనున్నట్లు చెప్పారు. గరిష్ఠంగా 20 మార్కుల వెయిటేజీ పొందే అవకాశం ఉంటుందన్నారు. తొలుత ఏపీపీఎస్సీ ద్వారా పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి వెల్లడించారు. ఆశావహులకి ప్రస్తుత పని ఒత్తిడి కారణంగా వెయిటేజీ విధానంలో నియామకాలు చేపట్టడం సాధ్యం కాదన్నారు. ద్వారా ఈ ఒక్కసారికి పశుసంవర్ధక శాఖ ద్వారా నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. భవిష్యత్ నియామకాలు పరీక్షా విధానంలోనే ఉంటాయని స్పష్టం చేశారు. సాక్షిలో చెప్పినట్టు ప్రస్తుతం డైరెక్టర్‌గా దామోదర్ నాయుడు లేరని అచ్చెన్నాయుడు చెప్పారు. ఒక మహిళా అధికారి ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. కనీసం డైరెక్టర్ ఎవరో తెలుసుకోకుండా కథనం రాస్తారా? అంటూ మండిపడ్డారు. 'హోంవర్క్ సున్నా.. ఆరోపణలు వంద.. ఇదే సాక్షి పరిస్థితి' అని విమర్శించారు. ఉద్యోగాలు ఇవ్వడం తమ విధానమని.. ఉద్యోగాలకు అడ్డుపడటం వైసీపీ విధానమని వ్యాఖ్యానించారు. నిరుద్యోగుల భవిష్యత్తుతో



రాజకీయాలు చేయొద్దని వైసీపీకి హితవు పలికారు. యువతకు న్యాయం చేసే విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# యూపీఐ చార్జీలు.. యూఎస్ ఒత్తిడికి కేంద్రం లొంగిందన్న రాహుల్ గాంధీ

మొదటి పేజి తరువాయి



యూపీఐ లావాదేవీలపై చార్జీల వద్దనకు దారి తీయవచ్చని అన్నారు. డొనాల్డ్ ట్రంప్‌ను సంతోషపెట్టేందుకు అమెరికా సంస్థలకు కేంద్రం ఈ చర్యతో స్వాగతం పలుకుతోందా? అని ప్రశ్నించారు. ' మర్చెంట్ యూపీఐ చెల్లింపులపై ఎమ్‌డీఆర్‌ను ఇకపై విధించే అవకాశం ఉంది. మొత్తం యూపీఐ లావాదేవీల్లో సంఖ్యా పరంగా వీటి (రూ.2 వేలకు పైబడి లావాదేవీలు) వాటా 5 శాతమే అయినప్పటికీ విలువ పరంగా మాత్రం 65 శాతం. వినియోగదారులపై చార్జీలు వద్దని ప్రభుత్వం చెబుతోంది. మరి ఈ లావాదేవీలపై షాపుల వారు చెల్లించే డబ్బులు ఎక్కడి నుంచి వస్తాయి?' అని అన్నారు. యూపీఐ లావాదేవీలపై ఎమ్‌డీఆర్ చార్జీలు విధించకపోవడాన్ని అమెరికన్ కంపెనీలు ఎప్పటి నుంచే వ్యతిరేకిస్తున్నాయని రాహుల్ గాంధీ చెప్పారు. ఈ ఒత్తిడికి తలొగ్గి ఎమ్‌డీఆర్ చార్జీలు విధించేందుకు కేంద్రం కొత్త మార్గం సిద్ధం చేసిందని ఆరోపించారు. 'యూఎస్ డీల్ వలెనే ప్రధాని మోదీ మరోసారి రాజీ పడ్డారు. అమెరికా ఒత్తిడికి లొంగారు' అని అన్నారు. తాము గతంలో హెచ్చరించినట్టుగానే జరిగిందని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ అన్నారు. పేమెంట్స్ అండ్ సెటిల్‌మెంట్స్ సిస్టమ్స్ యాక్ట్ - 2007కు చేసిన సవరణలను పేర్కొన్నారు. రూ.2 వేల పైచిలుకు విలువవగల యూపీఐ లావాదేవీలపై చార్జీలు విధించకుండా స్పష్టమైన రక్షణ ఏదీ కల్పించలేదని చెప్పారు. ఇది చార్జీల విధింపునకు వేదికను సిద్ధం చేయడమేనని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఈ రూ.2 వేల పరిమితికి కూడా మార్పులు రావొచ్చని హెచ్చరించారు.

### ఎమ్‌డీఆర్ అంటే..

క్రెడిట్, డెబిట్ కార్డు లావాదేవీల ప్రాసెసింగ్ కోసం షాపుల వారు చెల్లించే ఫీజును మర్చెంట్ డిస్కౌంట్ రేట్ (ఎమ్‌డీఆర్) అని అంటారు. ఎలక్ట్రానిక్ చెల్లింపులకు సంబంధించిన ఉపకరణాలు, నెట్‌వర్క్ మెయింటెనెన్స్, భద్రత కల్పించినందుకు ఈ ఫీజులు విధిస్తారు. వాణిజ్య సంస్థలు చెల్లించే ఈ చార్జీలను బ్యాంకులు, పేమెంట్ నెట్‌వర్క్‌లు (వీసా, మాస్టర్ కార్డు) తీసుకుంటాయి. ప్రస్తుతం భారత్‌లో క్రెడిట్, డెబిట్ కార్డుల చెల్లింపులపై ఎమ్‌డీఆర్ చార్జీలను విధిస్తున్నారు. ఇవి ఆయా వాణిజ్య సంస్థలే చెల్లిస్తున్నాయి. రూపే డెబిట్ కార్డు ఎమ్‌డీఆర్ చార్జీలకు సంబంధించి ప్రభుత్వం సబ్సిడీ చెల్లిస్తోంది. అయితే, యూపీఐ సేవలపై మాత్రం ప్రస్తుతం ఎలాంటి చార్జీలు లేవు. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

# ఉద్యోగులతో పెట్టుకుంటున్నారు.. కాంగ్రెస్ ఓటమి

మొదటి పేజి తరువాయి

రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. వారిని చిన్నచూపు చూస్తూ నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోవడం ఖాయమని వ్యాఖ్యానించారు. తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఉద్యోగులను రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగస్వాములుగా చూస్తామని కవిత చెప్పారు. ఉద్యోగులను గౌరవించేలా, వారు సంతోషంగా పనిచేసేలా తమ ప్రభుత్వం విధానాలు రూపొందిస్తుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉపాధ్యాయులు ఉద్యోగం



కన్నా ఉద్యమానికే ప్రాధాన్యం ఇచ్చి పోరాడారని కవిత గుర్తు చేశారు. రాష్ట్రంలో 630 మండలాలకు కేవలం ఎనిమిది మంది పర్మినెంట్ మండల విద్యాధికారులు (ఎంఈవోలు) ఉండటం విద్యా వ్యవస్థపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ఉచిత, నాణ్యమైన విద్య అందాలంటే బలమైన యంత్రాంగం అవసరమని అన్నారు. విద్యార్థుల వివరాలు, రిపోర్టుల పేరుతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. ఒక్క ఉపాధ్యాయుడితో నడుస్తున్న పాఠశాలల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. ఉద్యోగుల సహకారం లేకుండా ప్రభుత్వం ఏ కార్యక్రమాన్నీ సమర్థంగా అమలు చేయలేదని కవిత అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు కూడా ఆశించిన స్థాయిలో లేదని విమర్శించారు. మైకుల ముందు ఎన్ని గొప్పలు చెప్పినా పెన్షన్లు, యూరియా, రైతులకు విద్యుత్ అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల ముందు పీఆర్సీ, డీఏలు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటివరకు వాటిపై స్పందించలేదని అన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల ఫలితం

### 5 ఏళ్లలో 24.20 లక్షల ప్రదేశాల్లో శుభ్రతా చర్యలు
### - స్క్రాప్ విక్రయాల ద్వారా రూ.5,102.91 కోట్ల ఆదాయం

ఢిల్లీ : ప్రభుత్వ కార్యాలయాల్లో పనికిరాకుండా సామగ్రిని తొలగించడం, ఖాళీ స్థలాలను వినియోగంలోకి తీసుకురావడం, పెండింగ్ పనులను తగ్గించడం లక్ష్యంగా కేంద్రం చేపడుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు మంచి ఫలితాలు ఇచ్చాయి. గత ఐదేళ్లలో ప్రభుత్వ కార్యాలయాల్లోని స్క్రాప్ ను విక్రయించడం ద్వారా కేంద్రానికి ఏకంగా రూ.5,102.91 కోట్ల ఆదాయం సమకూరినట్లు తెలిపింది. 2021 నుంచి ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను కేంద్రం వరుసగా నిర్వహిస్తోంది. ఇప్పటివరకు ఐదు వార్షిక విడతలతో పాటు, జులై 2026 వరకు ప్రతి నెలా నిర్వహించిన సెక్రెటేరియట్ సంస్కరణల పర్యవేక్షణ కార్యక్రమాలను కలిపి 24.20 లక్షలకు పైగా ప్రదేశాల్లో చర్యలు చేపట్టారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరం లేని పాత వస్తువులు, పనికిరాని సామగ్రి, స్క్రాప్‌ను గుర్తించి తొలగించడంతో పాటు, పాత రికార్డులు, ఫైళ్లను కూడా పరిశీలిస్తున్నారు. ఈ ప్రక్రియలో 180.48 లక్షలకు పైగా ఫైళ్లను తొలగించడం లేదా మూసివేయడం జరిగింది. దీంతో కార్యాలయాల్లో రికార్డుల నిర్వహణ సులభతరమవడంతో పాటు, వినియోగానికి పనికొచ్చే స్థలం అందుబాటులోకి వచ్చింది.



### ఐదో విడతలో రూ.833 కోట్లకు పైగా

ప్రత్యేక పారిశుద్ధ్య ప్రచారంలో ఐదో విడతలోనే గణనీయమైన ఫలితాలు సాధించినట్లు సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ దశలో 11.6 లక్షల ప్రదేశాలను పరిశీలించి శుభ్రతా చర్యలు చేపట్టారు. దాదాపు 29.52 లక్షల ఫైళ్లను తొలగించారు. పాత సామగ్రి, స్క్రాప్‌ను తొలగించడం ద్వారా ఏకంగా 233.75 లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలం ఖాళీ అయింది. స్క్రాప్ విక్రయాల ద్వారా ఈ ఒక్క విడతలోనే సుమారు రూ.833.92 కోట్ల ఆదాయం వచ్చినట్లు సిబ్బంది మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

### ఆరో విడతకు రంగం సిద్ధం

ఇదే కార్యక్రమాన్ని మరింత విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఆరో విడతకు సిద్ధమవుతోంది. అక్టోబర్ 2 నుంచి 31 వరకు స్పెషల్ క్యాంపెయిన్ 6 నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను కేంద్ర సిబ్బంది వ్యవహారాల సహాయ మంత్రి జితేంద్ర సింగ్ బుధవారం ప్రారంభించనున్నారు. అయితే ప్రధాన ప్రచారానికి ముందుగానే సెప్టెంబర్ 16 నుంచి 30 వరకు సన్నాహక దశను చేపట్టనున్నారు. ఈ సమయంలో వివిధ మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ విభాగాలు తమ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను గుర్తిస్తాయి.

### ముందుగానే కార్యాచరణ ప్రణాళిక

సన్నాహక దశలో కార్యాలయాల్లో పెండింగ్ పనులు రికార్డులు, అవసరం లేని సామగ్రిని వర్గీకరించనున్నారు. క్షేత్రస్థాయి సిబ్బందిని కార్యక్రమంలో భాగస్వాములను చేయడం, ప్రచారం నిర్వహించాల్సిన ప్రదేశాలను ఖరారు చేయడం, పాత రికార్డులను సమీక్షించడం వంటి చర్యలు చేపడతారు. అదేవిధంగా కార్యాలయాల్లో అందుబాటులో ఉన్న స్థలాన్ని మెరుగ్గా వినియోగించుకునేందుకు స్పేస్ మేనేజ్‌మెంట్ ప్రణాళిక రూపొందించనున్నారు. గుర్తించిన స్క్రాప్‌ను సకాలంలో తొలగించేందుకు చర్యలు తీసుకుంటారు.

### 84 మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో సమీక్ష

క్యాంపెయిన్ -6లో భాగంగా కేంద్రంలోని మొత్తం 84 మంత్రిత్వ శాఖలు, విభాగాలకు చెందిన నోడల్ అధికారులు, ప్రజా ఫిర్యాదుల నోడల్ అధికారులు, అప్పీలేట్ అథారిటీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నారు. పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం (డీఏఆర్ పీజీ), తపాలా, బొగ్గు, గనులు, పాఠశాల విద్యఅక్షరాస్యత విభాగాల కార్యదర్శులు ఈ కార్యక్రమంలో అధికారులను ఉద్దేశించి మాట్లాడనున్నారు. ఆరో విడత ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం కేవలం ఢిల్లీలోని కేంద్ర కార్యాలయాలకే పరిమితం కాదు. అన్ని కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలు, వాటి కార్యాలయాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అవుట్‌స్టేషన్ కార్యాలయాల్లోనూ అమలు చేయనున్నారు. విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు, మిషన్లు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కానున్నాయి. క్యాంపెయిన్‌లో భాగంగా అమలు చేసిన వినూత్న విధానాలు, విజయవంతమైన నమూనాలను గుర్తించి ఇతర కార్యాలయాలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. డిసెంబర్ 19 నుంచి 25 వరకు నిర్వహించనున్న గుడ్ గవర్నెన్స్ వీక్‌లో ఈ ఉత్తమ విధానాలను ప్రదర్శించనున్నారు.

## రైలు బయలుదేరేటప్పుడు ఆగినప్పుడు ఇలా ఎందుకు జరుగుతుందో తెలుసా?



రైలు ఇంజిన్ ముందుకు లాగడం ప్రారంభించినప్పుడు లేదా డ్రైవర్ బ్రేక్ వేసినప్పుడు, ఆ ఒత్తిడి/బలం క్షణాల్లో ఒక కోచ్ నుండి తదుపరి కోచ్‌కి వేగంగా చేరుకుంటుంది. ఈ వేగవంతమైన శక్తి ప్రసారం వల్ల ప్రయాణికులకు జరక్ లేదా ఆకస్మిక కదలిక.. ప్రస్తుతం భారతీయ రైల్వేలలో పాత ICF (Integral Coach Factory) బోగీల స్థానంలో అత్యంత ఆధునికమైన LHB (Linke-Hofmann-Busch) కోచ్‌లను ఉపయోగిస్తున్నారు. ఇవి ప్రయాణికులకు సురక్షితమైనవి. అలాగే ప్రమాదాల సమయంలో తక్కువ నష్టం కలిగించేలా రూపొందించింది రైల్వే. అయితే, ఈ ఎల్‌హెచ్‌బీ (LHB) కోచ్‌లలో ప్రయాణించేటప్పుడు రైలు స్టేషన్ నుండి బయలుదేరేటప్పుడు లేదా బ్రేక్ వేసి ఆగే సమయంలో ప్రయాణికులు తీవ్రమైన జరక్ (వణుకు)ని అనుభవిస్తుంటారు. రైలు బయలుదేరినప్పుడు లేదా ఆగినప్పుడు వాందీ కోచ్‌లలో చాలా మంది ప్రయాణికులు ఎక్కువ కుదుపులను అనుభవిస్తారు. దీనికి ప్రధాన కారణాలలో ఒకటి వాందీ కోచ్‌లకు, పాత ICF కోచ్‌లకు మధ్య ఉన్న వ్యత్యాసం. సాధారణంగా,వాందీ కోచ్‌లలో టైట్-లాక్ జదీజ లేదా సెంటర్ బఫర్ కప్లర్‌ను ఉపయోగిస్తారు. ఈ వ్యవస్థలో కోచ్‌ల మధ్య వదులు చాలా తక్కువగా ఉంటుంది. ఫలితంగా, రైలు కదలడం ప్రారంభించిన వెంటనే ఇంజిన్ లాగే శక్తి లేదా అది ఆగినప్పుడు బ్రేకుల ప్రభావం త్వరగా తర్వాతి కోచ్‌లకు చేరుతుంది. అందుకే ఈ కుదుపులు ప్రయాణికులకు తరచుగా మరింత తీవ్రంగా అనిపిస్తాయి. అయితే, ఈ కప్లింగ్ సిస్టమ్ కేవలం ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని మాత్రమే రూపొందించలేదు. దీని అతి ముఖ్యమైన ప్రయోజనాల్లో ఒకటి భద్రతను పెంచడం. ప్రమాదం జరిగినప్పుడు కోచ్‌లు ఒకదానిపై ఒకటి ఎక్కే ప్రమాదాన్ని తగ్గించడంలో జదీజ యాంటీ-క్లైంబింగ్ సిస్టమ్ సహాయపడుతుంది. ఈ భద్రతా ఫీచర్ ముఖ్యంగా హై-స్పీడ్ రైళ్ల విషయంలో చాలా ముఖ్యం.రైలు ఇంజిన్ ముందుకు లాగడం ప్రారంభించినప్పుడు లేదా డ్రైవర్ బ్రేక్ వేసినప్పుడు, ఆ ఒత్తిడి/బలం క్షణాల్లో ఒక కోచ్ నుండి తదుపరి కోచ్‌కి వేగంగా చేరుకుంటుంది. ఈ వేగవంతమైన శక్తి ప్రసారం వల్ల ప్రయాణికులకు జరక్ లేదా ఆకస్మిక కదలిక మరింత తీవ్రంగా అనిపిస్తుంది.

## 20 ఏళ్ల పెట్టుబడి ప్రణాళిక దేనికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి..?



రాబోయే 20 ఏళ్లలో ఆర్థికంగా స్థిరపడాలంటే ముందుగానే గోల్ బేస్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ రూపొందించుకోవడం కీలకం. ఇల్లు, పిల్లల చదువు, వివాహం, రిటైర్మెంట్ వంటి ప్రతి లక్ష్యానికి ఎంత మొత్తం అవసరం, ఎప్పుడు అవసరం అనేది అంచనా వేసి పెట్టుబడులు పెట్టాలి. ద్రవ్యోల్బణం, పెట్టుబడి కాలవ్యవధి, రిస్క్ సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రణాళికను రూపొందించి, ఆదాయం పెరిగే కొద్దీ పెట్టుబడులను పెంచడం ద్వారా దీర్ఘకాలంలో మెరుగైన ఆర్థిక భద్రత సాధించవచ్చు. భవిష్యత్తు కోసం పెట్టుబడులు పెట్టడం అంటే ప్రతి నెల కొంత మొత్తాన్ని సేవింగ్స్‌లోకి మళ్లించడం మాత్రమే కాదు. ఏ లక్ష్యం కోసం ఎంత డబ్బు అవసరం? ఆ డబ్బు ఎప్పుడు అవసరం? అందుకోసం ఇప్పటి నుంచి ఎంత పెట్టుబడి చేయాలి? అనే విషయాలను ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకోవడం చాలా ముఖ్యం. 20 ఏళ్ల వంటి దీర్ఘకాలిక ప్రణాళికలో ఈ విధానం మరింత ఉపయోగకరంగా ఉంటుంది. రాబోయే 20 ఏళ్లలో ఎదురయ్యే ప్రధాన ఆర్థిక అవసరాలను ముందుగా రాసుకోవాలి.

**భారీ లక్ష్యాలకు ప్రాధాన్యత**

20 ఏళ్లకు రూపొందించే పెట్టుబడి ప్రణాళికలో.. ముందుగా భారీ లక్ష్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఇల్లు కొనడం, పిల్లల ఉన్నత విద్య, పిల్లల వివాహం, రిటైర్మెంట్ వంటి భారీ లక్ష్యాలను ఇందులో చేర్చాలి. ప్రతి లక్ష్యానికి ఒక నిర్దిష్ట మొత్తాన్ని, దాన్ని సాధించాల్సిన తేదీని నిర్ణయించుకోవాలి. అన్ని లక్ష్యాల కోసం ఒకే పెట్టుబడి బకెట్‌ను ఉపయోగించడం కంటే ఒక్కో లక్ష్యానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించడం మంచిది. సాధారణంగా ఏడాదిలోపు అవసరమయ్యే లక్ష్యాలను స్వల్పకాలికంగా, 1--8 ఏళ్ల మధ్య లక్ష్యాలను మధ్యకాలికంగా, 8 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ సమయం ఉన్న లక్ష్యాలను దీర్ఘకాలికంగా పరిగణించవచ్చు.

**ద్రవ్యోల్బణాన్ని మర్చిపోవద్దు**

ఈ రోజు ఒక లక్ష్యానికి అవసరమయ్యే మొత్తం, 10 లేదా 15 ఏళ్ల తర్వాత అదే మొత్తంగా ఉండకపోవచ్చు. విద్య, ఇల్లు, వైద్యం వంటి ఖర్చులు కాలక్రమంలో పెరిగే అవకాశం ఉంటుంది. అందువల్ల భవిష్యత్ లక్ష్యాన్ని లెక్కించేటప్పుడు ద్రవ్యోల్బణాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. తక్కువ కాలంలో అవసరమయ్యే డబ్బుకు స్థిరత్వం, లిక్విడిటీకి ప్రాధాన్యత ఇవ్వాలి. మరోవైపు 15--20 ఏళ్ల తర్వాత అవసరమయ్యే డబ్బుకు మార్కెట్ హెచ్చుతగ్గులను తట్టుకునేంత సమయం ఉంటుంది. కాబట్టి పెట్టుబడి ఎంపికలో లక్ష్య కాలవ్యవధి, రిస్క్ తీసుకునే సామర్థ్యం, వ్యక్తిగత పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలి. వివిధ ఆస్తి వర్గాల్లో పెట్టుబడులు విభజించడం ద్వారా రిస్క్‌ను కొంత మేర తగ్గించుకోవచ్చు, అయితే నష్టాల అవకాశాన్ని పూర్తిగా తొలగించలేం.

**రిటైర్మెంట్‌కు ప్రత్యేక స్థానం**

ఇల్లు, పిల్లల చదువు వంటి సమీప లక్ష్యాల మధ్య రిటైర్మెంట్ కోసం పెట్టుబడిని వాయిదా వేయకూడదు. 20 ఏళ్ల ఆర్థిక ప్రణాళికలో రిటైర్మెంట్ లక్ష్యానికి ముందుగానే స్థానం కల్పించాలి. దీర్ఘకాలిక రిటైర్మెంట్ పొదుపు కోసం ఫీూా కూడా ఒక ఎంపికగా పరిగణించవచ్చు.

**ప్రతి ఏడాది ప్రణాళికను సమీక్షించాలి**

పెట్టుబడి ఎంత రాబడి ఇచ్చిందనే దానికంటే, అది నిర్దేశించిన ఆర్థిక లక్ష్యానికి చేరువ చేస్తుందా లేదా అనేది ముఖ్యం. కనీసం ఏడాదికి ఒకసారి ప్రణాళికను సమీక్షించాలి. ఆదాయం, ఖర్చులు, కుటుంబ పరిస్థితులు లేదా ఉద్యోగంలో మార్పులు వచ్చినప్పుడు కూడా పెట్టుబడి ప్రణాళికను సవరించాలి.

**ఆదాయం పెరిగినప్పుడు పెట్టుబడినీ పెంచాలి**

20 ఏళ్ల ప్రణాళికను ప్రారంభించిన మొత్తంతోనే కొనసాగించాల్సిన అవసరం లేదు.

# హైకోర్టు ఆదేశాలకే నీళ్లొదిలిన జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు!

నోటీసులు లేవు.. తనిఖీలు లేవు: పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నా అమీర్‌పేటలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు!

అధికారుల 'మామూళ్ల' మౌనంతో పనులు పూర్తి.. వినియోగంలోకి ముస్తాబవుతున్న భవనాలు.

న్యాయస్థానాల ఆదేశాలకే విలువ లేకపోతే సామాన్యుడి ఫిర్యాదుల గతేంటి? బికేగూడ వాసుల తీవ్ర ఆగ్రహం.

బాధ్యులైన డిప్యూటీ కమిషనర్, ఏసీపీ, సెక్షన్ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్.





హైదరాబాద్/ (నేటి దిక్సూచి ప్రతినిధి): గ్రేటర్ హైదరాబాద్ లో టౌన్ ప్లానింగ్ అధికారుల బాధ్యతారాహిత్యం, నిర్లక్ష్యం పరాకాష్టకు చేరింది. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులే అక్రమార్కులకు తోడ్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజా ఫిర్యాదులను బుట్టదాఖలు చేయడమే కాకుండా, స్వయంగా అత్యున్నత హైకోర్టులో రిట్ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నప్పటికీ నిర్మాణ పనులను అడ్డుకోకపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కోర్టు పరిధిలో ఉన్న నిర్మాణాలను సైతం పూర్తయ్యే వరకు అధికారులు మౌనంగా ప్రేక్షక పాత్ర వహించడంపై స్థానికులు మండిపడుతున్నారు.

**బికేగూడలో యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన**

అమీర్‌పేట సర్కిల్ పరిధిలోని బికేగూడ, ప్లాట్ నంబర్: 7-1-401/ఎ/8, సర్వే నంబర్: 64/ఎ లలోని వివాదాస్పద నిర్మాణంలో టౌన్ ప్లానింగ్ అధికారుల వ్యవహారశైలిపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జీహెచ్ఎంసీ మంజూరు చేసిన ప్లాన్‌కు విరుద్ధంగా, భారీ అక్రమ సెల్లార్‌తో పాటు అదనపు అంతస్తులను నిర్మిస్తున్నారని స్థానికులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు కనీసం కన్నెత్తి చూడలేదని సమాచారం. మామూళ్ల మత్తులో జోగుతూ అధికారులు తనిఖీలు చేపట్టకపోవడంతో అక్రమ నిర్మాణం పూర్తయి, వినియోగంలోకి వచ్చేందుకు సిద్ధమైంది.

**న్యాయస్థానాల ఆదేశాలకే విలువ లేదా?**

రిట్ పిటిషన్లు, న్యాయపరమైన వివాదాలు ఉన్నప్పుడు అధికారులు చట్టబద్ధంగా వ్యవహరించి, పనులను నిలిపివేయాల్సి ఉంటుంది. కానీ అమీర్‌పేట సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ, సెక్షన్ ఆఫీసర్లు నిబంధనలను పూర్తిగా పక్కనబెట్టేశారు. "హైకోర్టు




ఆదేశాలకే టౌన్ ప్లానింగ్ అధికారులు విలువ ఇవ్వకపోతే, ఇక సామాన్య ప్రజల ఫిర్యాదులకు రక్షణ ఎక్కడుంటుంది?" అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారుల తక్షణ విచారణకు డిమాండ్ నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత చర్యలు తీసుకోవడం క్లిష్టతరంగా మారుతుందని తెలిసి కూడా అధికారులు కాలయాపన చేయడం వెనుక పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. బికేగూడ నిర్మాణ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, అందుకు బాధ్యులైన అమీర్‌పేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ,సంబంధిత సెక్షన్ అధికారులను తక్షణమే ఉద్యోగాల నుంచి సస్పెండ్ చేయాలని బికేగూడ ప్రజలు, బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

# బంగారం, వెండి ధరలకు భారీ షాక్.. MCXలో ఎందుకు పడిపోతున్నాయంటే?

ప్రస్తుతం బంగారం, వెండి మార్కెట్లలో అస్థిరత కొనసాగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అమెరికా ఆర్థిక డేటా, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై తీసుకునే నిర్ణయాలు, డాలర్ కదలికలు, అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు తదుపరి దిశను నిర్ణయించడంలో కీలకంగా.. బంగారం, వెండి ధరలు ఇటీవలి కాలంలో భారీగా పెరిగిన తర్వాత ఇప్పుడు కొంత ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. దేశీయ కమోడిటీ మార్కెట్ అయిన మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (వీజశ)లో గోల్డ్, సిల్వర్ ఫ్యూచర్స్ రేట్లు భారీగా తగ్గిపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లలో బలహీన సంకేతాలు, పెట్టుబడిదారుల ప్రాఫిట్ బుకింగ్ వంటి అంశాలు బులియన్ మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయి. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (వీజశ)లో అక్టోబర్ గోల్డ్ ఫ్యూచర్స్ 10 గ్రాములకు రూ.530 (0.35%) తగ్గి రూ.1.50 లక్షలకు చేరగా, డిసెంబర్ సిల్వర్ ఫ్యూచర్స్ కిలోకు రూ.1,411 (0.61%) తగ్గి రూ.2.31 లక్షలకు చేరాయి. ప్రపంచవ్యాప్తంగా, గోల్డ్ ఫ్యూచర్స్ ఔన్సుకు 0.22% తగ్గి వి4,290.06 వద్ద ఉండగా, సిల్వర్ ఔన్సుకు 0.27% తగ్గి వి63.05 వద్ద ట్రేడవుతోంది. డాలర్, యూఎస్ ట్రెజరీ ఈల్డ్స్ బలంగా కొనసాగుతుండగా, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటు నిర్ణయంపై అంచనాలు విలువైన లోహాలలో అస్థిరతను పెంచడంతో తాజా క్షీణత నమోదైంది. ఆనంద్ రాఠీ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్స్‌లో కమోడిటీస్, కరెన్సీస్ రీసెర్చ్ అనలిస్ట్ అయిన వేదికా నర్వేకర్, బంగారం 'కొత్త ఒత్తిడి'లో ఉందని, స్పాట్ ధరలు 0.77% తగ్గి ఔన్సుకు సుమారు వి4,266 వద్ద ఉన్నాయని అన్నారు. ఆగస్టు చివరిలో వి4,700 దాటిన తర్వాత బంగారం ఐదు వారాల కనిష్ట స్థాయికి పడిపోయిందని, ఈ నెలలో 3% కంటే ఎక్కువ తగ్గిందని చెప్పారు. బంగారం 10 గ్రాములకు సుమారు రూ.1.50 లక్షల స్థాయిలో కొనసాగుతుండగా, వెండి కిలోకు రూ.2.30 లక్షల పైన ఉంది.

**బంగారం ధర ఎందుకు తగ్గుతోంది?**

బంగారం ధరలపై ప్రధానంగా అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలు ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా అమెరికా డాలర్ బలపడటం, బాండ్ ఈల్డ్స్‌లో మార్పులు, వడ్డీ రేట్లపై అంచనాలు వంటి అంశాలు బంగారం ధరలపై ఒత్తిడిని పెంచుతున్నాయి. బంగారం ఎలాంటి వడ్డీ ఆదాయాన్ని ఇవ్వని ఆస్తి కావడంతో, వడ్డీ రేట్లు ఎక్కువగా ఉండే సమయంలో పెట్టుబడిదారులు ఇతర ఆదాయాన్ని ఇచ్చే పెట్టుబడుల వైపు మొగ్గు చూపే అవకాశం ఉంటుంది. దీంతో బంగారంపై డిమాండ్ తగ్గితే ధరలు కూడా ఒత్తిడికి గురవుతాయి.




**వెండిపై మరింత ప్రభావం**

బంగారంతో పోలిస్తే వెండి ధరల్లో హెచ్చుతగ్గులు ఎక్కువగా ఉంటాయి. ఎందుకంటే వెండి కేవలం విలువైన లోహం మాత్రమే కాదు.. పారిశ్రామిక అవసరాల్లో కూడా విస్తృతంగా ఉపయోగిస్తారు. ఎలక్ట్రానిక్స్, సోలార్ ప్యానెల్స్, తయారీ రంగాల్లో వెండికి డిమాండ్ ఉంటుంది. ప్రపంచ ఆర్థిక వృద్ధిపై ఆందోళనలు పెరిగితే పారిశ్రామిక డిమాండ్ తగ్గుతుందనే అంచనాలు వెండి ధరలపై ప్రభావం చూపుతాయి.

**ప్రాఫిట్ బుకింగ్ కూడా ఒక కారణమే**

బంగారం, వెండి ధరలు గతంలో భారీగా పెరిగిన నేపథ్యంలో కొంతమంది ఇన్వెస్టర్లు తమ లాభాలను బుక్ చేసుకునే అవకాశం ఉంది. ధరలు గరిష్ఠ స్థాయిలకు చేరిన తర్వాత ఇలాంటి ప్రాఫిట్ బుకింగ్ కనిపిస్తే మార్కెట్‌లో తాత్కాలికంగా అమ్మకాల ఒత్తిడి పెరుగుతుంది. ఇటీవలి వీజశ కదలికల్లో కూడా బంగారం, వెండి ధరలు గణనీయంగా తగ్గినట్లు మార్కెట్ నివేదికలు పేర్కొంటున్నాయి.

**ఇకపై బంగారం ధరలు ఎలా ఉండొచ్చు?**

ప్రస్తుతం బంగారం, వెండి మార్కెట్లలో అస్థిరత కొనసాగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అమెరికా ఆర్థిక డేటా, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై తీసుకునే నిర్ణయాలు, డాలర్ కదలికలు, అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు తదుపరి దిశను నిర్ణయించడంలో కీలకంగా మారనున్నాయి. అదే సమయంలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరిగితే సురక్షిత పెట్టుబడిగా భావించే బంగారానికి మళ్లీ డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. మరోవైపు డాలర్ బలపడటం, వడ్డీ రేట్లపై కఠిన వైఖరి కొనసాగితే బంగారం, వెండిపై మరింత ఒత్తిడి రావచ్చు.

**బంగారం కొనాలనుకునేవారికి ఇదే సరైన సమయమా?**

ధరలు తగ్గిన వెంటనే కొనుగోలు చేయాలా లేదా మరింత తగ్గుతాయా అనేది ఖచ్చితంగా చెప్పడం కష్టం. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులను బట్టి బంగారం ధరల్లో మరోసారి భారీ మార్పులు రావచ్చు. అందువల్ల కేవలం ఒకరోజు ధర తగ్గిందనే కారణంతో తొందరపడి పెట్టుబడి పెట్టకుండా, మీ అవసరం, పెట్టుబడి లక్ష్యం, రిస్క్ సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకోవడం మంచిది.బంగారం, వెండి ధరలు మార్కెట్ పరిస్థితులను బట్టి నిరంతరం మారుతుంటాయి. పై సమాచారం అవగాహన కోసం మాత్రమే; ఇది పెట్టుబడి సలహా కాదు.

# హైదరాబాద్ ట్రాఫిక్, కాలుష్యానికి చెక్ నగరానికి నలువైపులా కొత్త బస్ టెర్మినల్స్ కీలక ప్రకటన చేసిన మంత్రి పొన్నం!




హైదరాబాద్ నగర భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రజా రవాణా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నగరంలోకి వచ్చే దూరప్రాంత, అంతర్‌జిల్లా, అంతర్రాష్ట్ర బస్సులను నగర శివార్లలోని టెర్మినల్స్ వద్దే నిలిపి, అక్కడి నుంచి సిటీ.. హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, వాహన కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ప్రజలకు మెరుగైన ప్రజా రవాణా సౌకర్యాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తోందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ నగరానికి నలువైపులా ఆధునిక బస్ టెర్మినల్స్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. గాజులరామారం, శంషాబాద్, ఎల్బీనగర్, ఘట్కేసర్ ప్రాంతాల్లో బస్ టెర్మినల్స్ ఏర్పాటు చేసే ప్రతిపాదనలపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు వైపు నుంచి హైదరాబాద్‌లోకి వచ్చే దూరప్రాంత, అంతర్ జిల్లా, అంతర్రాష్ట్ర బస్సులను నగరంలోని అంతర్గత ప్రాంతాల్లోకి రాకుండా ఆయా దిశల్లో ఏర్పాటు చేసే టెర్మినల్స్ వరకు మాత్రమే నడిపించే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. విమానాశ్రయం వైపు వెళ్లే బస్సులు, హైదరాబాద్‌కు వచ్చే అంతర్‌జిల్లా బస్సులు కూడా అవసరాన్ని బట్టి నిర్దేశిత టెర్మినల్స్ వద్దే నిలిపి, అక్కడి నుంచి ప్రయాణికులను నగరంలోని వివిధ ప్రాంతాలకు తరలించే విధంగా లాస్ట్ మైల్ కనెక్టివిటీని బలోపేతం చేయనున్నట్లు వెల్లడించారు. టెర్మినల్స్ నుంచి ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు సులభంగా చేరుకునేలా సిటీ ఆర్టీసీ బస్సులు, మెట్రో రైలు, ఎంఎంటీఎస్ సేవలను సమన్వయం చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. దీంతో నగరంలోకి వచ్చే ప్రయాణికులకు సౌకర్యవంతమైన, వేగవంతమైన ప్రజా రవాణా అందుబాటులోకి వస్తుందని మంత్రి పేర్కొన్నారు.

**ప్రైవేట్ బస్సుల ఇష్టానుసారం:**

హైదరాబాద్ నగరంలో ప్రైవేట్ బస్సులు ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడం, రాత్రి సమయాల్లో రోడ్లపైకి పెద్ద సంఖ్యలో రావడం వల్ల ట్రాఫిక్ రద్దీతో పాటు కాలుష్యం కూడా పెరుగుతోందని మంత్రి తెలిపారు.ఈ సమస్యకు పరిష్కారంగా ప్రైవేట్ బస్సులను కూడా నిర్దేశిత బస్ టెర్మినల్స్ ద్వారా నిర్వహించే విధానంపై ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందన్నారు. అవసరమైన నిబంధనల మేరకు యూజర్ ఛార్జీలు వసూలు చేస్తూ టెర్మినల్స్‌ను వినియోగించుకునే విధానాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాలకు వెళ్లే ప్రైవేట్ బస్సులు, ఆర్టీసీ దూరప్రాంత బస్సులు నగరంలోని రద్దీ ప్రాంతాల్లోకి ప్రవేశించకుండా టెర్మినల్స్ వరకు మాత్రమే నడిపించే విధానం అమలులోకి వస్తే నగర ప్రధాన రహదారులపై ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గే అవకాశం ఉందన్నారు. బస్ టెర్మినల్స్ ఏర్పాటుకు అవసరమైన భూమి విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.గాజులరామారం ప్రాంతంలో సుమారు 100 ఎకరాలు, శంషాబాద్ వైపు సుమారు 150 ఎకరాల భూమిని బస్ టెర్మినల్ అవసరాలకు కేటాయించే అంశంపై ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని టెర్మినల్స్‌ను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయడంతో పాటు, ప్రయాణికులకు వేచి ఉండే ప్రదేశాలు, పార్కింగ్, కనెక్టివిటీ తదితర సౌకర్యాలను కల్పించేలా ప్రణాళిక రూపొందించనున్నట్లు మంత్రి తెలిపారు.

**2,200 ఎలక్ట్రిక్ బస్సులతో ప్రజా రవాణాకు మరింత బలం**

హైదరాబాద్ నగరంలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు రానున్న 2,200 ఎలక్ట్రిక్ బస్సులను సమర్థవంతంగా వినియోగించనున్నట్లు మంత్రి తెలిపారు.కొత్త ఎలక్ట్రిక్ బస్సుల ద్వారా నగరంలోని వివిధ ప్రాంతాలకు మెరుగైన సిటీ బస్ కనెక్టివిటీ కల్పించడంతో పాటు, బస్ టెర్మినల్స్ నుంచి నగరంలోని ప్రతి ప్రాంతానికి ప్రయాణికులు సులభంగా చేరుకునేలా రూట్లను రూపొందించనున్నట్లు తెలిపారు. టెర్మినల్ ఆధారిత ప్రజా రవాణా వ్యవస్థతో నగరంలోకి వచ్చే బస్సుల సంఖ్యను నియంత్రించడంతో పాటు, ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ప్రజా రవాణా మార్గాలను అందుబాటులోకి తీసుకురావచ్చన్నారు.

**ట్రాఫిక్, కాలుష్య నియంత్రణకు కీలక అడుగు**

హైదరాబాద్ నగర భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రజా రవాణా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నగరంలోకి వచ్చే దూరప్రాంత, అంతర్‌జిల్లా, అంతర్రాష్ట్ర బస్సులను నగర శివార్లలోని టెర్మినల్స్ వద్దే నిలిపి, అక్కడి నుంచి సిటీ బస్సులు, మెట్రో, ఎంఎంటీఎస్ ద్వారా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చే విధానం వల్ల నగరంలోని ప్రధాన రహదారులపై ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు వాహన కాలుష్యం కూడా తగ్గుతుందని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌ను మరింత సుస్థిరమైన, సమర్థవంతమైన ప్రజా రవాణా నగరంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# చెన్నూర్ ను ఆధునిక పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

## ఎస్టిపిపిలో మెగా రక్తదాన శిబిరం



జైపూర్,సెప్టెంబర్ 15,: మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్(ఎస్టిపిపి) లో సీఐఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సుధేష్ జాకర్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా రక్త నిధి కేంద్రం సహకారంతో తలసేమియా,సికిల్ సెల్ వ్యాధిగ్రస్తుల సహాయార్థం స్వచ్ఛంద మెగా రక్తదాన శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు.ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథులుగా సీఐఎస్ఎఫ్ కమాండెంట్ ఛాన్స్ బార్ సర్కార్,డిప్యూటీ కమాండెంట్ మనిదీప్ సింగ్ హాజరయ్యారు.ఈ రక్తదాన శిబిరంలో 47 మంది సీఐఎస్ఎఫ్ సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా జనరల్ సెక్రెటరీ చందూరి మహేందర్ మాట్లాడుతూ..ఒక్క యూనిట్ రక్తం ద్వారా ముగ్గురి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని,ముఖ్యంగా తలసేమియా,సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు నిరంతరం రక్తం అవసరమవుతుందని తెలిపారు.రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చని,ఒక ప్రాణాన్ని నిలిపే అవకాశాన్ని కల్పిస్తుందని,రక్తదానం చేయడం వల్ల తాజా రక్తం ఉత్పత్తి తో పాటు శరీరం శుద్ధి జరుగుతుందని,తద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందని,ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు.రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన అధికారులకు,రక్తదాతలకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా శాఖ తరపున జిల్లా జనరల్ సెక్రెటరీ చందూరి మహేందర్ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులు కాసర్ల శ్రీనివాస్,జైపూర్ సీఐఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ బి.బాలసుబ్రమణ్యం,సిఐఎస్ఎఫ్ జవాన్లు,రక్త నిధి వైద్యులు డా.బి.ప్రేమ్ సాయి,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మందమర్రి ఏరియాలో ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు




మందమర్రి, సెప్టెంబర్ 15: భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని మంగళవారం మందమర్రి సింగరేణి ఏరియాలో ఇంజనీర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఎల్లందు క్లబ్‌లో జరిగిన కార్యక్రమానికి ఏరియా జనరల్ మేనేజర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా విశ్వేశ్వరయ్య చిత్రపటానికి అధికారులు, ఇంజనీర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ నిర్మాణంలో, ముఖ్యంగా నీటిపారుదల, ఇంజనీరింగ్ రంగాల్లో విశ్వేశ్వరయ్య అందించిన సేవలను జీఎం కొనియాడారు. ఆయన క్రమశిక్షణ, నిబద్ధత, అంకితభావం ఇంజనీర్లకు ఆదర్శమన్నారు.సింగరేణి అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకమని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ భద్రతకు ప్రాధాన్యమిస్తూ ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని సూచించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన ఇంజనీర్లు, అధికారులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్లు, ఏజెంట్లు, ప్రాజెక్టు అధికారులు, ఏజీఎంలు, డీజీఎంలు, మేనేజర్లు, సీనియర్ పీవోలు, పీవోలు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాల్లో డీజేల వినియోగంపై నిషేధం

డీజే, సౌండ్ సిస్టమ్ ఆపరేటర్లకు పోలీసుల హెచ్చరిక.. ముందస్తు బైండ్‌ఓవర్ చర్యలు




మందమర్రి,సెప్టెంబర్ 15: గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన ఊరేగింపులను ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు మందమర్రి పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక డీజే, సౌండ్ సిస్టమ్ ఆపరేటర్లతో మందమర్రి పోలీస్‌స్టేషన్‌లో అవగాహన, హెచ్చరిక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ ఉత్సవాల సమయంలో శబ్ద కాలుష్యాన్ని నియంత్రించడం, ప్రజలకు ముఖ్యంగా వృద్ధులు, విద్యార్థులు, అనారోగ్యంతో ఉన్న వారికి ఇబ్బందులు కలగకుండా చూడటం పోలీసుల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. గణేష్ ఉత్సవాలు, నిమజ్జన ఊరేగింపుల్లో డీజే సౌండ్ సిస్టమ్‌ల వినియోగంపై నిషేధం అమల్లో ఉందని స్పష్టం చేశారు.ముందస్తు శాంతిభద్రతల చర్యల్లో భాగంగా స్థానిక డీజే, సౌండ్ సిస్టమ్ ఆపరేటర్లపై భారతీయ నాగరిక్ సురక్షా సంహిత ( బి ఎన్ ఎస్ ఎస్ ), 2023లోని సంబంధిత నివారణ నిబంధనల కింద బైండ్‌ఓవర్ ప్రొసీడింగ్స్ చేపట్టి, సంబంధిత అధికారుల ఎదుట హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.నిబంధనలను ఉల్లంఘించి డీజేలను వినియోగించినట్లయితే, చట్ట ప్రకారం సౌండ్ సిస్టమ్ పరికరాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు, సంబంధిత నిర్వాహకులు మరియు ఆపరేటర్లపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.గణేష్ మండళ్ల నిర్వాహకులు, భక్తులు పోలీసులకు సహకరించి నిబంధనలు పాటిస్తూ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని పోలీసులు కోరారు.

## హైమెండార్ఫ్ దంపతులకు తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డా. మైపతి అరుణ్ కుమార్ ఘన నివాళి.

ఐటీడీఏలకు పూర్వవైభవం కోసం ఐక్యంగా ఉద్యమించాలి..

'ఐటీడీఏ మార్చ్'ను విజయవంతం చేయాలని పిలుపు..



జైనూర్,, సెప్టెంబర్ 15..ఆదివాసీల ఆత్మబంధువులు ప్రొఫెసర్ క్రిస్టోఫ్ వాన్ ఫ్యూరర్-హైమెండార్ఫ్, బెట్టి ఎలిజబెత్ హైమెండార్ఫ్ దంపతులు గిరిజన సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ కొనియాడారు.కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం మార్లవాయి గ్రామాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని హైమెండార్ఫ్ దంపతుల స్మారక స్థలానికి చేరుకుని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం డా. మైపతి అరుణ్ కుమార్ మాట్లాడుతూ.ఆదివాసీల జీవన విధానం, సంస్కృతిపై హైమెండార్ఫ్ దంపతులు చేసిన పరిశోధనలు, అందించిన నివేదికల ఆధారంగా ప్రభుత్వాలు ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని డిమాండ్ చేశారు. జల్-జంగల్-జమీన్ రక్షణతో పాటు విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగ హక్కుల సాధన కోసం ఆదివాసీలంతా ఏకతాటిపైకి వచ్చి పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.గిరిజన ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి పట్టుకొమ్మలైన ఐటీడీఏ వ్యవస్థలకు పూర్వ వైభవం తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. ఏజెన్సీ సమస్యలను సర్కారు దృష్టికి తీసుకెళ్లేందుకు తలపెట్టిన 'ఐటీడీఏ మార్చ్' కార్యక్రమంలో ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాజ్యాంగబద్ధంగా కల్పించిన హక్కుల అమలుకై ప్రజాస్వామ్య పద్ధతిలో నిరంతరం ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కొమురం భీమ్ మనవడు కొమురం జంగు, మార్లవాయి గ్రామ సర్పంచ్ కనక ప్రతిభ, గ్రామ పటేల్ ఆత్రం మాణిక్ రావు, సార్మేడి గేడం గణపత్, తుడుందెబ్బ రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు, గిరిజన విద్యార్థి సంఘం ప్రతినిధులు, ఆదివాసీ యువత భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

### 2027 గోదావరి పుష్కరాలకు చెన్నూర్ లో 70 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు

### రాష్ట్ర కార్మిక,ఉపాధి శిక్షణ,కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్.



చెన్నూరు సెప్టెంబర్ 15: చెన్నూర్ ను ఆధునిక పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నామని, 2027 జూలైలో జరగనున్న గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. మంగళవారం జిల్లాలోని చెన్నూర్ లో పుష్కర ఘాట్ నిర్మాణానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, నీటిపారుదల శాఖ అధికారి విష్ణు, మండల తహసిల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, మున్సిపల్ చైర్ పర్సన్ పెద్దింటి పద్మ లతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ గోదావరి పుష్కరాలు 2027 కొరకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి పనుల కొరకు 1 వేయి కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని, ఇందులో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చెన్నూర్ లో పుష్కరాలు, మౌలిక వసతుల అభివృద్ధి కొరకు 70 కోట్ల రూపాయలతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. సుమారు 8 కోట్ల రూపాయలతో పుష్కర ఘాట్లు, స్నానపు గదులు, రహదారులు తదితర సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, పుష్కరాలకు దాదాపు 1 లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా రోడ్లు, త్రాగునీరు, పారిశుధ్యం, లైటింగ్, పార్కింగ్ తదితర మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గోదావరి రోడ్డుతో పాటు చెన్నూర్ పట్టణంలోని రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని, అంబేద్కర్ విగ్రహం నుంచి చెన్నూర్ వరకు సుమారు 5 కోట్ల 50 లక్షల రూపాయలతో రోడ్డు విస్తరణ, లైటింగ్ పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. రోడ్డు విస్తరణలో షాపులు కోల్పోయిన చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా షాపులు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని, పేదలు, చిరు వ్యాపారులకు ప్రయోజనం కలిగేలా 1 కోటి 20 లక్షల రూపాయల డి ఎం ఎఫ్ టి నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అమృత్ 2.0 పథకం క్రింద సుమారు 30 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ప్రతి ఇంటికి నల్లా ద్వారా త్రాగునీరు అందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. చెన్నూర్ పెద్ద చెరువును సుమారు 17 కోట్ల రూపాయలతో చేసేందుకు చర్యలు చేపడుతున్నామని, శివ్వారం గోదావరి మొసళ్ల మడుగు ప్రాంతాన్ని అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల అభివృద్ధి కోసం నిధులు కేటాయించి పనులు చేపడుతున్నామని, కాళేశ్వరం, ధర్మపురి, బాసర, భద్రాచలం, కోటిలింగాల, చెన్నూర్ లోని అంబ అగస్తేశ్వర ఆలయాల అభివృద్ధి, పునర్నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. పుష్కరాల నాటికి ఆలయాలు, పుష్కర ఘాట్లు, రోడ్లు తదితర అభివృద్ధి పనులు పూర్తి చేసి భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. చెన్నూర్ లో నిర్మించిన 100 పడకల ఆసుపత్రిని ఈ నెలలోనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. అనంతరం పుష్కర ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో భూమిపూజ నిర్వహించారు. చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు బొక్కలగూడెంలో గౌడ సంఘం కమ్యూనిటీ భవనానికి భూమిపూజ చేశారు. సుమారు 30 లక్షల రూపాయల వ్యయంతో కమ్యూనిటీ భవనం నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. పేద గౌడ కులస్తులలో ఇందిరమ్మ ఇళ్లు లేని అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ఇళ్ల సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెన్నూర్ లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సన్న బియ్యం పంపిణీ తదితర అంశాలపై మంత్రి సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం జిల్లాలోని మందమర్రి మండలం రామకృష్ణాపూర్ ప్రాంతంలోని 5వ వార్డులో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు షేర్ ద విజన్ - ఖమ్మం సంస్థ ప్రతినిధి పి.నారాయణ అందజేసిన వాటర్ బాటిల్, నోట్ పుస్తకాలు, క్రీడా సామాగ్రి లతో కూడిన కిట్లను జిల్లా కలెక్టర్, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, షేర్ ద విజన్ సంస్థ సభ్యుల తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కిట్లు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో రూఫింగ్ పనుల కొరకు 30 లక్షల రూపాయల డి ఎం ఎఫ్ టి నిధులు మంజూరు చేయడం జరిగిందని, విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రమైన త్రాగునీటి కొరకు ఆర్.ఓ. ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు, కాస్మెటిక్ ఛార్జీలు, క్రీడా సామగ్రి తదితర సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. మెస్ చార్జీలను 40 శాతం పెంచడం జరిగిందని, ఉపాధ్యాయుల నియామకం చేపట్టి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ మండలం సోమనపల్లిలో ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులకు ఉన్నత విద్యాభ్యాసానికి ఎంతో ఉపయోగపడుతుందని, విద్యార్థులు అందుబాటులోకి వచ్చే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. చెన్నూర్ లో డిగ్రీ కళాశాల అభివృద్ధికి నిధులు కేటాయించి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న బ్రేక్‌ఫాస్ట్ పథకం ద్వారా విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నామని, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో ఈ సంవత్సరం విద్యార్థుల నమోదు పెరిగిందని తెలిపారు. సోమనపల్లిలో సుమారు 200 కోట్ల రూపాయలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. 100 మందికి పైగా విద్యార్థులు ఉన్న పాఠశాలలకు ఆర్.ఓ. ప్లాంట్ల ఏర్పాటు, నాణ్యమైన ఆహారం, యూనిఫాంలు తదితర సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, సొంత భవనాలు లేని పాఠశాలలకు సొంత భవనాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం, ఏకరూప దుస్తులు, పుస్తకాలు అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో లెర్నింగ్ అవుట్‌కమ్స్ మెరుగ్గా ఉన్నాయని, ఇదే స్థాయిని కొనసాగించేలా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.50 యూనియన్ చందా రికవరీని వెంటనే నిలిపివేయాలి..

హెచ్ఎంఎస్ డిమాండ్‌గడువు ముగిసిన సంఘానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వొద్దు..

అన్ని కార్మిక సంఘాలకు సమాన హోదా కల్పించాలి..

ఐకే-1ఏ, ఐకే-ఓసీపీ మేనేజర్లకు వినతిపత్రం అందజేత..



శ్రీరాంపూర్, సెప్టెంబర్ 15.. సింగరేణి కార్మికుల వేతనాల నుంచి ప్రతినెలా ఏఐటీయూసీ చందా పేరిట రికవరీ చేస్తున్న రూ.50 మొత్తాన్ని వెంటనే నిలిపివేయాలని హింద్ మజ్దూర్ సభ డిమాండ్ చేసింది. ఈ మేరకు శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని గనుల మేనేజర్లకు హెచ్ఎంఎస్ నాయకులు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ తిప్పారపు సారయ్య మాట్లాడుతూ.. గుర్తింపు పొందిన కార్మిక సంఘాల కాలపరిమితి 2025 డిసెంబర్ 27తోనే ముగిసిందని గుర్తుచేశారు. గుర్తింపు లేఖలు ఆలస్యంగా రావడంతో దాదాపు 10 నెలల పాటు ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాలు అదనంగా గుర్తింపుతో కొనసాగాయని, చివరకు సెప్టెంబర్ 8వ తేదీ నాటికి ఏఐటీయూసీ కోరిన పూర్తి గడువు కూడా తీరిపోయిందని స్పష్టం చేశారు. కాలపరిమితి ముగిసినప్పటికీ కొందరు అధికారులు ఏఐటీయూసీకి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కొత్తగా కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించే వరకు హెచ్ఎంఎస్‌తో సహా అన్ని రిజిస్టర్డ్ సంఘాలకు సమాన హోదా కల్పించాలని డిమాండ్ చేశారు.

**ప్రధాన డిమాండ్లు:**

కార్మికుల జీతాల నుంచి ఏఐటీయూసీ కోసం చేస్తున్న రూ.50 చందా కటింగ్‌ను వెంటనే రద్దు చేయాలి. అన్ని రిజిస్టర్డ్ కార్మిక సంఘాలకు సింగరేణిలో సమాన హోదా ఇవ్వాలి. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలను తక్షణమే నిర్వహించాలి. సేఫ్టీ కమిటీ, మైన్స్ కమిటీ, టెంపుల్ కమిటీ వంటి అధికారిక సమావేశాలన్నింటికీ అన్ని కార్మిక సంఘాల ప్రతినిధులను ఆహ్వానించాలి. యాజమాన్యం ఏ ఒక్క సంఘం పట్ల కూడా పక్షపాత ధోరణి అవలంబించరాదు.యాజమాన్యం పక్షపాత వైఖరిని వీడకపోతే కార్మికుల హక్కుల రక్షణ కోసం ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్లు దుర్గం లక్ష్మణ్, ఎస్‌కే వలి, పులి రాజేందర్, కాసర్ల అశోక్ రెడ్డి, పిట్ సెక్రటరీలు గుండ్ల లక్ష్మణ్ కుమార్, ఎర్రం శెట్టి సాయికుమార్, ఏరియా నాయకులు రాధాకృష్ణ, శ్రీకాంత్ రెడ్డి, దుర్గాప్రసాద్, బాలరాజు, చుంచు శ్రీను, నాగరాజు, అశోక్ రెడ్డితో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిషేధ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

జిల్లా కలెక్టర్ కె.హరిత




ఆసిఫాబాద్ సెప్టెంబర్ 15: కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మంగళవారం పోలీస్, రెవెన్యూ, శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్య, విద్య, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ కె.హరిత సమీక్ష సమావేశం నిర్వహించారు. మిషన్ వాత్సల్య కార్యక్రమం కింద బాల్య వివాహాల నిషేధ చట్టం, పోక్సో చట్టాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేసేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కె.హరిత సూచించారు. బాల్య వివాహాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలపై తల్లిదండ్రులకు వివరించాలని, కిశోర బాలికల సాధికారతను పర్యవేక్షించాలని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలని, లైంగిక నేరాల నుంచి బాలల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, లైంగిక వేధింపులు, అశ్లీల చిత్రాల కోసం పిల్లలను ఉపయోగించేవారిని గుర్తించి పోక్సో చట్టం కింద కఠినంగా శిక్షించాలని ఆదేశించారు. గ్రామ, మండల స్థాయిలలో కమిటీలు ఏర్పాటు చేసి సర్పంచ్‌లు, స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వాములు చేయాలని తెలిపారు.అనంతరం మన అంగన్వాడీ మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా 9వ పోషణ మాసంపై సమీక్షించారు. ఈ నెల 9 నుంచి వచ్చే నెల 8 వరకు అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ మాసాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించాలని, మూడేళ్లలోపు పిల్లలందరూ అంగన్వాడీల్లో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పప్పు, ఆకుకూరలు, చిరుధాన్యాలతో కూడిన అనుబంధ పోషకాహారం అందించాలని సూచిస్తూ పోషణ మాసం గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వరూపారాణి, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, జిల్లా విద్యాధికారి సచ్చిదానంద చారి, డీసీపీఓ మహేష్, జిల్లా మాధ్యమిక విద్యాధికారి రాందాస్, సీడీపీఓలు, సఖి-బాలల రక్షణ సిబ్బంది, శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కరాటే లో విద్యార్థుల ప్రతిభ



రెబ్బెన సెప్టెంబర్ 15 : హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో రెబ్బెన మండలం గోలేటి కి చెందిన ఎస్.కె హర్షాన్ వెండి పతకం సాధించాడు. సెంట్ క్లారెట్ స్కూల్ (సీబీఎస్ఈ) విద్యార్థులు ఎం. శివకుమార్ కట్టా విభాగంలో బంగారు పతకం, ఎస్.కె. హర్షన్ వెండి పతకం, హర్షిత పటేల్ కాంస్య పతకం సాధించారు. ఫాతిమా కాన్వెంట్ హైస్కూల్ విద్యార్థి కృష్ణ ప్రసాద్ వెండి పతకం సాధించాడు. విద్యార్థుల విజయంపై ఆయా పాఠశాలల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఫాదర్ అభినందనలు తెలిపారు. కరాటే మంచిర్యాల అధ్యక్షుడు వి. రవి, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కార్యదర్శి ఎం. దేవయ్య విద్యార్థులను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## నూతన ఆవిష్కరణలతోనే సమాజ అభివృద్ధి ; జీఎం . శ్రీరమేష్



రెబ్బెన సెప్టెంబర్ 15. సృజనాత్మకతతో కొత్త ఆలోచనలకు రూపమిచ్చే ప్రతి వ్యక్తి ఒక ఇంజినీర్‌తో సమానమని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీరమేష్ అన్నారు. మంగళవారం జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో ఇంజినీర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన జీఎం మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేని సమయంలో సివిల్ ఇంజినీర్‌గా విశ్వేశ్వరయ్య అందించిన సేవలు, ఆయన నిర్మించిన కట్టడాల ప్రాధాన్యతను వివరించారు. దేశ నిర్మాణంలో ఆయన చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం భారతరత్న పురస్కారంతో సత్కరించిందన్నారు. ప్రకృతికి విఘాతం కలగకుండా సాంకేతికతను ఉపయోగిస్తూ నూతన ఆవిష్కరణలు చేసిన పలువురు ఇంజినీర్ల సేవలను జీఎం కొనియాడారు. సాంకేతిక అభివృద్ధి సమాజ ప్రగతికి దోహదపడేలా ఇంజినీర్లు మరిన్ని వినూత్న ఆలోచనలకు రూపకల్పన చేయాలని ఆకాంక్షించారు. ఇంజినీర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మైనింగ్ ఇంజినీర్‌గా సింగరేణికి సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఎస్ఓ టు జీఎం కె. రాజమల్లును జీఎం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఖైరిగుర పీఓ ఎం. నరేందర్, ఏరియా ఇంజినీర్ వీరన్న, ఏరియా సేఫ్టీ అధికారి స్వామిరాజు, డీజీఎం (ఐఈ) ఉజ్వల్‌కుమార్ బెహరా, డీజీఎం (పర్సనల్) కిరణ్‌బాబు, సివిల్ ఎస్ఈ శ్రీధర్, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం ; పీఓ నరేందర్



రెబ్బెన సెప్టెంబర్ 15. సింగరేణి ఉద్యోగులు దైనందిన జీవితంలో కనీసం గంటసేపైనా మైదానంలో గడిపితే ఆరోగ్యంగా ఉంటారని ఖైరిగుర ప్రాజెక్ట్ అధికారి మచ్చగిరి నరేందర్ అన్నారు. మంగళవారం గోలేటిలోని సింగరేణి పాఠశాల మైదానంలో డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ 93వ వార్షిక క్రీడా పోటీల్లో భాగంగా డిపార్ట్‌మెంటల్ వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడల్లో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక పరిణతి కూడా ముఖ్యమన్నారు. ప్రత్యర్థి బలాబలాలను అంచనా వేసి వ్యూహంతో ఆడటం క్రీడల్లో కీలకమని పేర్కొన్నారు. సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించి ప్రతిరోజూ కొంత సమయం మైదానంలో నడవడం లేదా క్రీడల్లో పాల్గొనడం అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. అనంతరం జరిగిన వాలీబాల్ పోటీలో ఎస్ఓ టు జీఎం జట్టుపై ఖైరిగుర పీఓ జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు బయ్య మొగిలి, డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ గౌరవ కార్యదర్శి డి. ప్రశాంత్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కిరణ్‌బాబు, జనరల్ కెప్టెన్ ఎస్‌కే. అబ్బాస్తో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

## మోదీ ప్రభుత్వ 25 ఏళ్ల పూర్తి సందర్భంగా సేవా సంకల్ప అభియాన్

సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు కార్యక్రమాలు



ఆసిఫాబాద్ సెప్టెంబర్ 15: కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిర్పూర్ శాసనసభ్యుడు డా.పాల్వాయి హరీష్ బాబు మాట్లాడారు.నరేంద్ర మోదీ జన్మదినమైన సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు సేవా సంకల్ప్ అభియాన్ నిర్వహిస్తారని తెలిపారు. సెప్టెంబర్ 17న సాయంత్రం మోదీ క్షేమం కోరుతూ ప్రతి ఇంట్లో దీపం వెలిగించాలని కోరారు. అక్టోబర్ 7 వరకు పాఠశాలలు, కళాశాలల్లో చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు, కళాజాతల ద్వారా ప్రదర్శనలు నిర్వహిస్తామని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో అంగన్ మిలన్ కార్యక్రమం ద్వారా తల్లులు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలను సన్మానిస్తామని, లబ్ధిదారుల వీడియోలు, రీల్స్, ఫోటోలు సేకరించి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తామని చెప్పారు. అక్టోబర్ 7న సేవజ్యోతి యాత్ర, టార్చ్ ర్యాలీలు నిర్వహిస్తామని, ప్రధాన కూడళ్లలో ఎల్ఈడీ స్క్రీన్లపై మోదీ ప్రసంగాలు ప్రదర్శిస్తామని తెలిపారు. రక్తదాన శిబిరాలు, మొక్కలు నాటే కార్యక్రమం, వైద్య శిబిరాలు, ఫిట్ ఇండియా స్పోర్ట్స్ సెషన్, నీటి సంరక్షణ, సైబర్ సెక్యూరిటీ అవగాహన వంటి సేవా కార్యక్రమాలను భాజపా నాయకులు, కార్యకర్తలు నిర్వహిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో సేవా సంకల్ప్ అభియాన్ జిల్లా ఇన్‌చార్జ్ నామని మహేష్, జిల్లా భాజపా అధ్యక్షుడు ధోనీ శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

Printed , Published and Owned by POLAGONI ALIVELU, and Printed at Smilys Online, 6-7-48, Vanasthalipuram, Shopping Complex, Rangareddy-500070. Telangana State and Published from 17-10-25, Plot No.H.No. 4-136/12, Turkayamjal Journalist Colony, Rangareddy501510, Telangana State. Editor: POLAGONI ALIVELU. PRGI No. TGTEL/25/A3190. Phone No: +91 7989151815